


తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర
# విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :101 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ బుధవారం 04 ఫిబ్రవరి 2026

## ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి:

### -పార్లమెంటు వద్ద వైసీపీ ఎంపీల నిరసన

-ప్లకార్డులు చేతపట్టి ఆందోళనకు దిగిన వైసీపీ ఎంపీలు
-ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోందని నినాదాలు
-కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్



2

## వాట్సాప్‌కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్

వ్యక్తిగత గోప్యత విషయంలో ఆటలొద్దు..
రాజ్యాంగాన్ని ఫాలో కావాల్సిందే
రూల్స్ అమలు చేయకుంటే దేశంలో నుంచి వెళ్లిపోండి




2

## ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ:

### -సీఎం చంద్రబాబు

రాష్ట్రాన్ని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చడమే లక్ష్యమన్న సీఎం
లంబసింగిలో పీపీపీ విధానంలో కుంకుమపువ్వు సాగుకు ప్రణాళిక
ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం
రైతుల కోసం డిజి రైతు బజార్, కిసాన్ డ్రోన్ యాప్‌ల ప్రారంభం



2

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏలూరు జిల్లాలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కోకో సిటీలో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని ప్రక్రియలు ఒకేచోట ఉండేలా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనితో పాటు మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ హబ్‌గా ఏపీ

రాష్ట్రాన్ని దేశంలోనే అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులను భాగస్వాములను చేస్తూ, సాగు విస్తీర్ణాన్ని 50 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు.

## శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి ..

# విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

-ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
-సిట్ నివేదిక, ఛార్జ్‌షీట్‌లో తేడాలు ఉన్నట్టు గుర్తింపు
-అసలు వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి, అసలు వాస్తవాలను వెలికితీసేందుకు ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంగళవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సమర్పించిన నివేదిక, కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి అందిన సమాచారం మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నట్టు కేబినెట్ గుర్తించింది. సిట్ విచారణలో వెలుగు చూసిన కొన్ని కీలక అంశాలను ఛార్జ్‌షీట్‌లో ఎందుకు చేర్చలేదనే విషయంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మూడు అంశాల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి, అసలు సూత్రధారులను, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకే విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కమిషన్ ద్వారా తిరుమల లడ్డూ పవిత్రతపై భక్తుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విచారణ కమిషన్ నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని కేబినెట్ తెలిపింది.

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది:

### - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి
ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి



2

హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు.వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు.నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు.

# లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

## 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

--బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్
-చైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం



2

# కొండవీడు ఉత్సవాల నిర్వహణపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి : ప్రత్తిపాటి

**- 5న పట్టణంలో నిర్వహించే ఉత్సవాల కర్టెన్ రైజర్ ప్రత్యేక 2.కె రన్ భారీస్థాయిలో విజయవంతం కావాలి.**

**- ఆర్డీవో, ఇతర అధికారులతో కొండవీడు ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మాజీమంత్రి.**



చిలకలూరిపేట అక్షర విజేత

7, 8 తేదీల్లో భారీ ఎత్తున నిర్వహించనున్న కొండవీడు ఉత్సవాల నిర్వహణపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని, ప్రజలు.. ముఖ్యంగా పర్యాటకులు తమ జీవితానికి సరిపడా సరికొత్త అనుభూతులతో ఉత్సవాలను ఆస్వాదించాలని, అందుకు తగిన ఏర్పాట్లలో ఎక్కడా చిన్నలోపం తలెత్తడానికి వీల్లేదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో స్థానిక ఆర్డీవో ఇతర అధికారులు, వివిధ శాఖల ప్రధానాధికారులతో కొండవీడు ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చేవారు కొండవీడు మార్గంలో కాలుమోపింది మొదలు.. తిరిగి వెళ్లేవరకు తమ మనసు నిండా ప్రభుత్వం నిర్వహించే వివిధ రకాల కార్యక్రమాల ఆనందాన్నే నింపుకోవాలని, అందుకు తగినట్టుగా అన్నిశాఖల యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ప్రత్తిపాటి ఆదేశించారు. ఉత్సవాలకు అతిథులుగా వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రధాన నాయకుల పర్యటన, కార్యక్రమాల్లో ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ప్రత్తిపాటి సూచించారు. ఆర్టీసి అధికారులు పర్యాటకుల్ని కొండపైకి తరలించి, కిందకు తీసుకురావడంలో ప్రణాళికాబద్ధంగా నిబద్ధతతో పనిచేయాలన్నారు. పర్యాటకులకు అవసరమైన తాగునీరు, ఆహారం, ఇతరత్రా ఏర్పాట్లలో యంత్రాంగం మనసుపెట్టి పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, కూటమినాయకులతో కలిసి కొండవీడు ఫెస్ట్ -2026 గోడ పత్రికలు, ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, ఎమ్మార్వోలు విజయ శ్రీ, మహమ్మద్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, పర్యాటకశాఖ అధికారి నాయుడమ్మ, ఆర్టీసీ ఆర్ఎం అజిత్ కుమారి, నాయకులు నాగండ్ల రాంబాబు, కొత్తూరి ప్రదీప్, తుబాటి శ్రీహరి, వినాయక ట్రస్టు సభ్యులు మణి, తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్ కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్

భారత పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దేశంలో వ్యాపారం చేయాలంటే భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిందేనని, రాజ్యాంగ విలువలను, నిబంధనలను పాటించి తీరాలని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనలను పాటించకుంటే దేశం విడిచి వెళ్లాల్సిందేనని వాట్సాప్ మాతృసంస్థ మెటాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఈ రోజు జరిగిన విచారణలో వాట్సాప్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనల విషయంలో వాట్సాప్ తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్ అయింది. వాట్సాప్ యూజర్ల వివరాలను, డేటాను మెటాతో పంచుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది.డేటా షేరింగ్, మార్కెట్ ఆధిపత్యానికి సంబంధించి గత నెలలో ఎన్సీఎల్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వాట్సాప్, మెటా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సాప్ పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ వ్యాఖ్యలు చేశారు. 'మీరు మా దేశ పౌరుల గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలో ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేము అనుమతించబోము' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అమెరికా సంస్థ మెటాకు తేల్చిచెప్పారు.భారత చట్టాలను పాటించలేకపోతే దేశం వదిలి వెళ్లాలని సూచించారు. డేటా షేరింగ్ ఉండదని హామీ ఇవ్వాలని, లేదంటే ఈ కేసును కొట్టేస్తామని హెచ్చరించారు. చాట్ ట్రెండ్‌ల ఆధారంగా ప్రకటనలతో సహా వినియోగదారు డేటా ప్రవర్తన, వాణిజ్య దోపిడీ వినియోగదారుల హక్కులను ఉల్లంఘిస్తుందని కోర్టు తెలిపింది. వైద్యులతో ప్రైవేట్ చాట్‌ల తర్వాత వినియోగదారులు ఔషధాల కోసం ప్రకటనలను అందుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసింది. ఇది డేటా మానిటైజేషన్ పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

# ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి:

పార్లమెంట్ ఎదుట వైసీపీ ఎంపీలు ప్లకార్డులు చేతపట్టి ఆందోళనకు దిగారు. ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోందని వారు నినాదాలు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని... అవసరమైతే ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల నివాసాలపై దాడుల నేపథ్యంలో వైసీపీ ఎంపీలు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే కేంద్ర హోం శాఖ కార్యదర్శిని కలిసి పరిస్థితిని వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా కలిసి పరిస్థితులను ఆయనకు వివరించాలని వైసీపీ భావిస్తోంది.

# లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు."ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు.అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు.తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం..

కావలి,

ఆఫీస్ రెడ్ క్రాస్ ప్రాంగణం లోని సాంఘిక సంక్షేమ హాస్టల్ నందు వార్డెన్ స్ గా విధులు నిర్వహిస్తున్న ప్రసూన,సునీతా, మరియు మంజులా లు రిపబ్లిక్ డే సందర్భంగా ఆర్డీవో సన్నీ వంశీ కృష్ణ మరియు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి లచేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ కావలి వారు వారిని ఈరోజు హాస్టల్ నందు సమావేశం ఏర్పాటుచేసి ఘనంగా సన్మానించడం జరిగింది.. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ బాధ్యులు హరినారపరెడ్డి వారిని అభినందిస్తూ, అంకితభావం, నిబద్దత తో పనిచేసే ఉద్యోగులకు తప్పక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని,ఇలాగే ఇక ముందు కూడా కృషి చేసి కలెక్టర్ అవార్డుకు కూడ ఎంపిక కావాలని ఆకాక్షించారు.అవార్డు గ్రహీతలు ఈ కార్యక్రమం ఏర్పాటుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ, రెడ్ క్రాస్ కావలి, వారు దాతల సహకారంతో హాస్టల్ లో ఏర్పాటుచేసిన ట్యూషన్ సెంటర్, దోమతెర లు ఏర్పాటు,ఛార్జింగ్ లైట్స్,మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేసి మందుల పంపిణీ, మాట్స్ (చాపల )పంపిణీ, ప్రతివారం స్పీకింగ్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్ మొదలగు అంశాలపై క్లాస్సెస్..విద్యార్థినులను ప్రోత్సాహిస్తూ బహుమతుల పంపిణీ మొదలగు కార్యక్రమాలతో పాటు ఆర్డీవో ఆధ్వర్యంలో విద్యార్థిని లకు నోటుబుక్స్, స్టేషనరీ, ఎగ్జామ్స్ పాడ్స్, మరియు పదవ తరగతి విద్యార్థినులకు స్టడీ చైర్స్ మరియు స్టడీ పాడ్స్ పంపిణీ మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తూ హాస్టల్ అభివృద్ధి ని ప్రోత్సాహస్తున్నందుకు హర్షము వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలియచేసారు.. ఇంకా ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ హాస్టల్ కమిటీ సభ్యులు స్వర్ణ లత, బోరెడ్డి రజని, ట్యూషన్ టీచర్స్, సిబ్బంది హాస్టల్ స్టూడెంట్స్ పాల్గొన్నారు



# ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ:

రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, వారి ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని వివరించారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించేందుకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయాలను ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలన్నారు. సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

**పంటల వైవిధ్యంపై ప్రత్యేక దృష్టి**

సంప్రదాయ పంటలతో పాటు, వాణిజ్యపరంగా లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా, లంబసింగి ప్రాంతంలో స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో కుంకుమపువ్వు సాగు చేపట్టే సంస్థలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో వెనుకబడ్డామని, ఇకపై ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

**అనుబంధ రంగాలకు చేయూత**

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమల బలోపేతానికి కూడా ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఆక్వా రైతులు తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలన్నారు. పౌల్ట్రీ రంగానికి ఊతమిచ్చేలా, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను నేరుగా రైతులకే అప్పగించాలని నిర్దేశించారు.

**టెక్నాలజీ వినియోగం, మార్కెటింగ్**

ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏఐ ఆధారిత క్రాప్ అడ్వైజరీ 'భారత్ విస్తార్' వంటి టెక్నాలజీలను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు.

ఈ సందర్భంగా 'డిజి రైతు బజార్', 'ఏపీఏఐఎంఎస్', 'కిసాన్ డ్రోన్' యాప్‌లను సీఎం ఆవిష్కరించారు. వీటి ద్వారా రైతులు కూరగాయలు ఆన్‌లైన్‌లో అమ్మడం, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు అద్దెకు తీసుకోవడం వంటి సేవలు పొందవచ్చని అధికారులు వివరించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సాగరమాల పథకం కింద జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై రాజ్యసభలో ప్రశ్నించిన బీద మస్తాన్ రావు యాదవ్

కావలి,




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,నెల్లూరు జిల్లాలో సాగరమాల పథకం కింద నిర్మించిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనుల పూర్తి స్థితి, ప్రాజెక్టు వ్యయం, మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం మరియు ఉపాధి సృష్టి అంశాలపై రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ ఈరోజు రాజ్యసభలో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర పోర్టులు, షిప్పింగ్ & జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టుకు 18 మార్చి 2020న ఆమోదం లభించిందని, మొత్తం వ్యయం ₹288.80 కోట్లుగా నిర్ణయించబడిందని మంత్రి తెలిపారు. ఇందులో కేంద్ర మత్స్యశాఖ మరియు పోర్టులు, షిప్పింగ్ & జలమార్గాల మంత్రిత్వ శాఖల నుండి చెరో ₹69.145 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పథకం కింద ₹150.51 కోట్లు నిధులు కేటాయించబడ్డాయనివెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు అమలు సంస్థగా ఇప్పటివరకు ₹282.43 కోట్లు వ్యయం చేయగా, కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు పూర్తిగా విడుదలయ్యాయని, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన అన్ని భాగాల పనులు పూర్తయ్యాయని మంత్రి స్పష్టం చేశారు.సాగరమాల పథకం కింద జాతీయ ఉత్పాదకత మండలి (ఛీూజ) నిర్వహించిన తృతీయ పక్ష సామాజికఆర్థిక ప్రభావ అంచనాలో, మత్స్యకారుల వలసలు తగ్గడం, ఉపాధి అవకాశాలు మరియు వ్యాపార కార్యకలాపాలు పెరగడం వంటి సానుకూల ఫలితాలు నమోదు అయినట్లు తెలిపారు.ఈ ఫిషింగ్ హార్బర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన అనంతరం సుమారు 6,100 మంది మత్స్యకారులకు (ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా) ఉపాధి లభించనుండగా, 1,250 పడవలను నిర్వహించే సామర్థ్యం, సంవత్సరానికి 41,250 మెట్రిక్ టన్నుల చేపల ల్యాండింగ్ సామర్థ్యం (విలువ సుమారు ₹282.60 కోట్లు) కలగనుందని మంత్రి వివరించారు.ఈ సందర్భంగా బీద మస్తాన్ రావు యాదవ్ మాట్లాడుతూ,"జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా నెల్లూరు జిల్లా మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడటంతో పాటు, ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ ప్రాజెక్టు పూర్తిగా ప్రజలకు ఉపయోగపడేలా రాష్ట్రంకేంద్రంసమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలి" అని అన్నారు.

# హైదరాబాద్‌లో ఫైర్ సేఫ్టీ పాఠాలు చెబుతున్న హైడ్రా

హైదరాబాద్ నగరంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే లక్ష్యంతో ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన కల్పించేందుకు నగరం నలుమూలలా భారీ ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించింది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.ఇటీవల నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ షోరూంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పాటు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనలు ఈ చర్యలకు ప్రధాన కారణంగా నిలిచాయి. చాలా వాణిజ్య భవనాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని అధికారులు జరిపిన తనిఖీల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో, అగ్నిమాపక భద్రతా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేందుకు వాణిజ్య సంస్థలకు నెల రోజుల గడువు ఇస్తూనే, మరోవైపు ఈ అవగాహన కార్యక్రమాలను చేపట్టారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ ప్రమాదం సంభవిస్తే మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలనే అంశాలపై వివరిస్తున్నారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగం, మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే ఆటోమేటిక్ వాటర్ స్ప్రింక్లర్లు, పొగను గుర్తించే స్మోక్ డిటెక్టర్ల పనితీరుపై ప్రాక్టికల్‌గా చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. షాపులు, కార్యాలయాల్లో ఫైర్ ఎగ్జిట్ మార్గాలను గుర్తించడం, వాటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతున్నారు.పంజాగుట్ట, మాదాపూర్, గచ్చిబౌలి-మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ క్లాక్ టవర్, అల్వాల్, బంజారాహిల్స్, శంషాబాద్, కొంపల్లి, నాంపల్లి వంటి 30కి పైగా ప్రధాన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కొన్ని చోట్ల ఫైర్ మాక్ డ్రిల్స్ కూడా నిర్వహించి, ప్రమాద సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో కార్మికులకు, వ్యాపారులకు సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖకు చెందిన 101 నంబర్‌తో పాటు, హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 1070 లేదా మొబైల్ నంబర్ 9000113667కు ఫోన్ చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు



అక్షర విజేత
బుధవారం 04 ఫిబ్రవరి 2026



# వైభవంగా ముత్యాలమ్మ వార్షికోత్సవం



తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: పట్టణంలో ని తాళ్ల ముదునూరిపాడు పుంతలో ముసలమ్మ గుడి నుంచి యాగర్లపల్లి వెళ్లే రహదారి పక్కన పచ్చని పొలాల మధ్యలో కొలువైన శ్రీ ముత్యాలమ్మ వారికి 18 వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరతాయని భక్తుల విశ్వాసం. ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 7000 మంది అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ గ్రామ పెద్దలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్, 18 వ వార్డు టిడిపి ఇన్చార్జి బేచ్ రెడ్డి ఉదయ వెంకట భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు బేతి రెడ్డి అమ్మిరెడ్డి, వెలగల నర్సారెడ్డి, మేడపాటి గురెడ్డి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి, ఆకుల సుబ్బయ్య, హనుమంతు కుమార్, వెలగల అవినాష్ రెడ్డి, సత్తి జగదీష్ రెడ్డి, చల్లా శివ పాల్గొన్నారు

# 92 వ వార్డు లో సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ



అక్షర విజేత గోపాలపట్నం:: విశాఖ పశ్చిమ నియోజకవర్గం 90 మరియు 92 వ వార్డు కు చెందిన నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వైద్య ఖర్చులు నిమిత్తం నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొండేసి యోగ దీపికా కు 21600 రూ/లు, నీలాపు దుర్గాభవాని కి 25574 రూ/లు గణబాబు చేతులమీదుగా మంగళవారం అందజేశారు, ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ అనారోగ్యం తొ బాదపడుతున్న నిరుపేదలకు కూటమి ప్రభుత్వం తక్షణ సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందజేసి ఆదుకుంటుందని అన్నారు, కార్యక్రమంలో దాడి రమేష్ నాయుడు, యలమంచిలి ప్రసాద్,కంపర ఆనంద్, శరగడం అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ది

# గిరిజనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

## ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప

అనంతపురం

అనంతపురం:గిరిజనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప పేర్కొన్నారు. మంగళవారం గుత్తి మండలం ఎర్రగుడి గ్రామంలో గిరిజనులు మరియు ఉన్నత అధికారులతో ఎస్టీ కమిషన్ సభ్యులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీఓ శ్రీనివాస్, డిఎస్పీ, తహసిల్దార్, ఎంపిడిఓ, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి గ్రామ గిరిజనులు కమిషన్ సభ్యులుని ఘనంగా స్వాగతించి సత్కరించారు. అనంతరం స్థానిక గిరిజనులతో వివిధ సమస్యల మీద వినతి పత్రాలు స్వీకరించి, సమస్యల మీద ఉన్నత అధికారులతో చర్చించారు. గిరిజన సమస్యలను అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని అధికారులకు సూచించారు. అధికారులు తమ పరిధిలో ఉన్నటువంటి గిరిజన గ్రామాలలో పర్యటించి వారి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో అధికారుల మీద శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం అనంతరం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మరియు జగదాంబ అమ్మవారిని దర్శించుకుని స్థానికంగా ఉన్న గిరిజన గురుకుల పాఠశాల మరియు కళాశాలను సందర్శించి విద్యార్థులతో చర్చిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మరియు బోధన బోధనేతర సిబ్బంది మరియు గిరిజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పన్నులు చెల్లించండి గ్రామ అభివృద్ధికి సహకరించండి

## -డిప్యుటీ ఎంపిడిఓ గపూర్



రామసముద్రం పిబ్రవరి3 అక్షర విజేత

రామసముద్రం మండల ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ ఎంపిడిఓ గపూర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ లలో పన్నులు వేగవంతంగా వసూళ్లు చేయాలని సిబ్బందికి తెలియజేసారు. పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని, పంచాయతీకి పన్నులు చెల్లిస్తే అభివృద్ధి చెందుతాయని,పలు గ్రామల్లో పంచాయతీ కి సంబందించిన చింత చెట్లు, చేపల చెరువులు ఉన్నాయని, గత వారం చెంబకూరు, పెద్దకురప్పల్లె వేలం పాట నిర్వహించడం తెలిసిందే, మూడు, నాలుగు రోజుల్లో కాప్పల్లె గ్రామపంచాయతీ కి చెందిన రెండు చేపల చెరువులు వేలం వేయడం జరుగుతుందని ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొని అదికమొత్తంలో పాడి పంచాయతీ అభివృద్ధి కి తోడుకావాలన్నారు, పంచాయతీలకు పన్నులు, వేలం పాటల ద్వారా వచ్చే ఆధాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవచ్చునన్నారు. గ్రామల్లో ఏ సమస్యలు ఉన్న గ్రామ సచివాలయానికి వెళ్లి అధికారులను సంప్రదించండి. గ్రామల్లో నీటిసమస్య, విద్యుత్ దీపాలు, మురికి కాలువలు సరిగా లేవని అధికారులకు తెలియజేయండి వారు గ్రీన్ అంబాసిడర్లు ద్వారా మరమ్మత్తులు చేయడం జరుగుతుందని, పొడి చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదని ప్రతి రోజు అంబాసిడర్లు వచ్చి చెత్తను వాహనాలు ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిప్యుటీ ఎంపిడిఓ గపూర్ సిబ్బంది పాల్గొన్నారు

# అక్షర విజేత తెలుగు జాతీయ దిన పత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన మండలనేని చరణ్ తేజ





చిలకలూరిపేటఅక్షర విజేత

జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ అక్షర విజేత తెలుగు జాతీయ దినపత్రిక 2026నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అక్షర విజేత తెలుగు జాతీయ దినపత్రిక ‘ ముందుండాలని ఆకాంక్షించారు.పత్రికా విలువలను కాపాడుతూ, నిష్పక్షపాతంగా వార్తలను ప్రజలకు అందిస్తారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.నూతన సంవత్సరంలో పత్రిక మరెన్నో విజయాలు సాధించాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అక్షర విజేత తెలుగు జాతీయ దినపత్రిక చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్చార్జి పీ మనోహర్ పాల్గొన్నారు.

# ఈవోను అభినందించిన ఎమ్మెల్యే



తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: తాడేపల్లిగూడెం గ్రామ దేవత బలుసులమ్మ తల్లి ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్ జిల్లా మొత్తం అధికారిగా రిపబ్లిక్ డే రోజున కలెక్టర్ నుండి ప్రశంస పత్రం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆయన అభినందించారు.

# వివాహ వార్షికోత్సవ వేడుకలు



పత్తిపాడు ప్రతినిధి, అక్షర విజేత:మండలంలోని తిరుమలి గ్రామం మిరాకిల్ మినిస్ట్రీస్ చర్చ్ అధినేత,మిరాకిల్ మినిస్ట్రీస్ సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పాస్టర్ ప్రవీణ్ పాల్, సంకీర్తన పాల్ దంపతుల 10వ వివాహ వార్షికోత్సవ వేడుకలను ఏలేశ్వరం మండల పాస్టర్ ఫెలోషిప్ సంఘ సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఎస్ ఎలేజా, ఫెలోషిప్ అధ్యక్షులు కుంపట్ల పాల్ ప్రసాద్, అలమండ ప్రసాద్, వాసా సామెల్, కుమార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాన్ విల్సన్ పుట్టినరోజు వేడుకలు

ప్రత్తిపాడు ప్రతినిధి, అక్షర విజేత : రిటైర్డ్ ఉపాధ్యాయుడు,పాస్టర్ జాన్ విల్సన్ 71వ జన్మదిన వేడుకలను మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శాలువా చిరు సత్కారం చేశారు .ఈ సందర్భంగా పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు మాట్లాడుతూ జాన్ విల్సన్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రభువైన ఏసుక్రీస్తు ప్రార్థన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు కుంపట్ల పాల్ ప్రసాద్,పౌండర్ ఎస్ ఎలైజా,అలమండ ప్రసాద్,ప్రవీణ్ పాల్, జగదీష్,కుమార్ పాల్, వాసా సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



# వరుసగా దళితులపై దాడులు హత్యలు అడ్డుకట్టు వేయాలంటున్న నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ ఇంచార్జ్ సుమల చార్లెస్



అక్షర విజేత ఎమ్మిగనూరు:

వరుస దళిత నేతల హత్యలు. అందులో భాగంగా మొన్న . ఎం ఆర్ పి ఎస్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల రమేష్ హత్య గావించబడ్డారు. ఈహత్యలకు నిరసనగా అన్ని ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు అన్ని కూడా రేపు ఉదయం 11 గంటలకు . ఎన్ ఏ పి గెస్ట్ హౌస్ నందు సమావేశానికి హాజరై తమ తమ అభిప్రాయాలను తెలపాలని మనస్ఫూర్తిగా ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నాను. మీ విలువైన అభిప్రాయాలను తెలియజేసి హత్యలకు అడ్డుకట్ట వెయ్యాడానికి మనమందరం కృషి చేద్దామని మరొక్కసారి మిమ్మల్ని అందరిని రేపటి సమావేశానికి ఆహ్వానిస్తున్నాను. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు సుమాల చార్లెస్

# జరుగుతున్నదొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అక్షర విజేత మెంటాడ: జిల్లాలో జరుగుతున్న దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంద్ర ఎస్ఐ కే సీతారాం అన్నారు. జిల్లాలోనీ రాజాం పరిసర ప్రాంతాలలో తాళం ఉన్న ఇంట్లో రెండు కోట్ల విలువ చేసే బంగారాన్ని దొంగలు దోచుకెళ్ళారని అందుచేత ఊరికి దూరంగా ఉంటున్నా ఇల్లు లు గలవారు, ఒంటరి ఇల్లు ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలనీ ఒంటరిగా ఉన్న ఇళ్లకు సిసి కెమెరాలు పెట్టించుకోవాలని డబ్బు బంగారం ఉన్నట్లయితే ఇంటిలో ఉంచుకోకుండా బ్యాంకులలో భద్రపరుచుకోవాలని ఇంటి పరిసరాల్లో ఏదైనా జరిగినట్లయితే డైలీ హండ్రెడ్ కి ఫోన్ చేయాలని సూచించారు.

# ప్రజాసేవకు మించిన తృప్తి ఉండదు

### మండలానికి మంచిపేరు తేవాలి

### స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మాజీ ఎంపీపీ చలుమూరి అప్పల నాయుడు

### ఇద్దరు ఉపాధ్యాయులకు గ్రూపు-2 విజేతలకు సన్మానం



అక్షర విజేత మెంటాడ:

ఉద్యోగ జీవితంలో ప్రజలకు చేసిన సేవకు మించిన తృప్తి మరేదీ ఉండదని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చలుమూరి అప్పల నాయుడు అన్నారు. ఇటీవలి గ్రూప్-2 ఫలితాల్లో విజేతలుగా నిలిచి వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించిన నలుగురు విజేతలు సిరిపరపు రేణుక, పిన్నింటి శ్రీపతి, కెల్ల సత్యవతి, లెంక అరుణకుమారి తోపాటు జిటి పేట గ్రామానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను తమ్మిరాజుపేట గ్రామంలో మంగళవారం రాత్రి సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ ప్రయత్నంలో వారి పట్టుదల, కృషి, మిగతవారికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించి వ్యక్తిగత పేరు ప్రతిష్ఠలతోపాటు తల్లిదండ్రులకు, స్వగ్రామానికి, మండలానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. విజేతల తల్లిదండ్రులను కూడా ఈసందర్భంగా అభినందించారు. విజేతల ప్రయాణంలో తల్లిదండ్రుల సహకారం ఎనలేనిదని చెప్పారు. తమకు జరిగిన సన్మానానికి విజేతలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు గేదెల సన్యాసమ్మ, మండల టీడీపీ అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, విశ్రాంతి ఉద్యోగి ప్రభూజి, సర్పంచ్ చొక్కాకు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు

# అనాథలకు సాయం చేస్తే భగవంతునికి సేవ చేసినట్లే

## బూదూరు వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం

అక్షర విజేత మంత్రాలయం:

మంత్రాలయం మండలం లొ బుదూరు గ్రామంలో సమాజంలో ఉన్న అనాథలకు సాయంచేస్తే ఆభగవంతునికి సేవ చేసినట్టే అని బూదురు గ్రామ వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య అన్నారు. మంగళవారం ఆయన బూదూరు స్వగృహంలో ఎమ్మిగనూరులో ఉన్న పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు సాయంచేస్తే ఆ భగవంతుడు మన కుటుంబాలకు మేలులు చేస్తాడన్నారు.రబోయే కాలంలో తనాశక్తి మేరకు మేరకు సహాయం చేస్తానని అన్నారు.ఇలాంటి సేవ చేసే వారిని ప్రోత్సహించాలన్నారు. ఎమ్మిగనూరులోని పూలే అంబేద్కర్ సొసైటీ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న, సొసైటీ అధ్యక్షురాలు ప్రతిభా భారతి,సాతర్ల ప్రసాద్ కదిరి కోట సుందర్రాజు సామేల్,లకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు జక్కయ్యకు కృతజ్ఞతలు తెలిపారు...



# ఏలేరు జలాశయంలో చేప పిల్లలు విడుదల

ప్రత్తిపాడు ప్రతినిధి, అక్షర విజేత : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టిని సాధించాలని ఆప్ కబ్ వైస్ చైర్మన్ కే రంగారావు సూచించారు.మంగళవారం ఏలేరు జలాశయం లోని నాలుగు లక్షల నలభై వేల చేప పిల్లలను విడుదల చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా మత్స్యశాఖ అధికారి వి కృష్ణారావు ఏలేరు జలాశయం 5936 హెక్టార్ల విస్తీర్ణంతో ఐదు మండలాలకు విస్తరించి ఉందన్నారు. దీని క్యాచ్ మెంట్ ఏరియా ల్ 2,23,200 హెక్టార్లు వైశాల్యం కలిగి ఉందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా బీసీ మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీతో నాలుగు లక్షల 40000 మేలు జాతి నాణ్యమైన కడ్ల, రాగండి, మ్రగాల వంటి చాప పిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు.ఈ చేప పిల్లలు విడుదలతో మత్స్యకారులకు మస్తు సంపదని సమకూర్చడం ద్వారా వారి ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు.ఏలేరు ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 400 మంది అనుమతి పొందిన మత్యకారు కుటుంబాలు జీవనోపాధి పొందుతున్న అన్నారు ఏలేరు జలాశయం పరిసర ప్రాంతాలకు మంచి నాణ్యమైన ప్రోటీన్లు అధికంగా గల సిద్ధంగా పెరిగే చేప పిల్లలను ఆహారంగా అందించవచ్చని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా స్థానిక మత్స్యశాఖ ఇన్స్పెక్టర్ రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేదికపై జిల్లా మత్స్యశాఖ అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని మత్స్యకారులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని దీనిలో ప్రధానంగా వేట సమయములో ప్రమాదవశాత్తు మృత్యువాత పడిన మత్స్యకారులకు బీమా సదుపాయం కల్పించడం ద్వారా వారి కుటుంబాలకి కేంద్రప్రభుత్వం ఐదు లక్షల బీమా సౌకర్యం చెల్లించగా రాష్ట్ర ప్రభుత్వం మరో ఐదు లక్షలు ఇస్తుందన్నారు. అలాగే మత్స్యకారులు వేటకు వినియోగించే మరుబోట్లు 40,60 శాతం సబ్సిడీతో మరో బోర్డులు వలలు వంటివి అందించడం జరుగుతుందన్నారు. అలాగే వ్యాపారాలకు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మత్య సంపదని తరలించేందుకు అవసరమయ్యే



వాహనాలను ప్రభుత్వము ద్వారా పొందుతున్నారు.ఆటోలు,వ్యాన్లు, మోపెడ్ బళ్ళు వంటి వాహనాలను సబ్సిడీపై పొందే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ చైర్మన్ బసవ వీరబాబు, మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి,ఉపాధ్యక్షులు చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావు, తెలుగుదేశం పార్టీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు పసలసూరిబాబు,సీనియర్ నాయకులు అలకరాజు,నూకతాటి ఈశ్వరరావు,పెంటకోట శ్రీధర్, సూదిబాబులు పెంటకోట సత్తిబాబు,ప్రత్యేక పర్యవేక్షణ అధికారి నాగయ్య,ఏడి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పర్యవేక్షించండి

తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: నియోజవర్గంలో చేపట్టే రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులను ఆయా గ్రామాల ప్రజలు పర్యవేక్షించాలని, నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలని శాసనసభ్యులు, ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం మండలం పెద్ద తాడేపల్లి నుంచి రామన్నగూడెం, జగ్గన్నపేట, వెంకట రామన్నగూడెం వరకు అదనపు ప్రణాళిక నిధులు మూడు కోట్ల 50 లక్షల రూపాయలతో చేపట్టిన సిమెంట్ రహదారి, తారు రహదారి నిర్మాణ పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాలను పట్టణానికి అనుసంధానిస్తూ నిర్మించే ఈ రోడ్లు అభివృద్ధికి బాటలు పరుస్తాయన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనేక అవస్థలు పడ్డారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్లు, డ్రైన్లు నిర్మించి పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాదు, పెంటపాడు మండల జనసేన అధ్యక్షులు పుల్లా బాబీ, పరిమి సురేష్, ఎంపీటీసీ గోవిందు, బండి బుజ్జిబాబు,



పరిమి సూర్యనారాయణ,పాలూరి వెంకటేశ్వరరావు, రామ లక్ష్మణ్, మద్దిపాటి ధర్మేంద్ర, మద్దిపర్తి రవితేజ, ఉడతా బాలాజీ, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వేలు పెట్టడానికే ఆలోచించే సమస్యలో.. జగన్ ఏకంగా కాలు పెట్టాడు : ప్రత్తిపాటి

- భూ రక్ష పేరుతో ప్రజలభూముల భక్షణకు ప్రయత్నించాడు.- జగన్ సృష్టించిన భూ సమస్యలు పల్లెల్లో కొట్లాటకు దారితీశాయి.
- చిన్న అక్షరం కూడా తప్పులేని పాసుపుస్తకాలు ప్రతి రైతుకు అందించేవరకు సమస్యను ముఖ్యమంత్రి విడిచిపెట్టరు.
- గణపవరం, సాతులూరు రైతులకు ప్రభుత్వ పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసిన మాజీమంత్రి ప్రత్తిపాటి.

గణపవరం అక్షర విజేత

దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని పెద్ద తప్పు గతంలో జగన్ చేశాడని, సున్నితమైన ప్రజల భూముల సమస్యలో వేలుపెట్టాలంటేనే ఎవరైనా వెనుకాడతారని, అలాంటిది జగన్ ఏకంగా కాలు పెట్టి, భూ రక్ష పేరుతో ప్రజల భూముల భక్షణకు ప్రయత్నించాడని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన నాదెండ్ల మండలం గణపవరం, సాతులూరు గ్రామాల్లో కూటమిప్రభుత్వం రాజముద్రతో ముద్రింపచేసిన పట్టాదారు పాసుపుస్తకాలను కూటమినాయకులు, రెవెన్యూ అధికారులతో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

జగన్ సమస్యవల్ల ఐక్యంగా ఉండే గ్రామాల్లో కొట్లాటలు ప్రారంభమయ్యాయి

చిన్న అక్షరం కూడా తప్పులేని సమగ్ర సమాచారంతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అర్హులైన ప్రతి రైతుకు అందించేవరకు ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు అంత తేలిగ్గా విడిచిపెట్టరని ఈ సందర్భంగా ప్రత్తిపాటిచెప్పారు. జగన్ భూ రక్ష సమగ్ర సర్వే పేరుతో రైతుల భూముల గట్లు, హద్దురాళ్లు, అడంగల్ మ్యాపులు, భూవివరాలు అన్నీ మార్చేయించాడని, వైసీపీనేతలు ఇష్టానుసారం భూముల హద్దులు మార్చి రైతుల్ని ఇబ్బందులకు గురిచేశారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. జగన్ సృష్టించిన సమస్యవల్ల ఐక్యంగా ఉండే గ్రామస్తులు.. తమలో తామే కొట్లాడుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. ప్రజల ఆస్తుల మద్య జగన్ రాజేసిన చిచ్చును సరిచేయడానికి కూటమిప్రభుత్వం ఇప్పటికీ ఎన్నో కష్టాలు ఎదుర్కొంటోంద న్నారు. రైతుల సమక్షంలోనే భూ సర్వే చేయాలని, భూమి హద్దుదారులందరి సమ్మతి తెలియచేశాకే, భూ యజమానికి ఎలాంటి తప్పులులేని పట్టాదారు పాసుపుస్తకాలు అందచేయాలని ప్రభుత్వం ఇప్పటికే జీవోకూడా జారీచేసిందని ప్రత్తిపాటి వివరించారు.

భూ సమస్యలపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు

రైతులెవరూ తమ భూ సమస్యలపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్న ప్రత్తిపాటి, గణపవరం గ్రామ పరిధిలో 1326 పాసు పుస్తకాలకు గాను అధికారులు 1256 పుస్తకాలు పంపిణీ చేశారన్నారు. పాసుపుస్తకాలు పొందిన ప్రతి ఒక్కరూ



ఎలాంటి తప్పులు గుర్తించినా, వెంటనే రెవెన్యూ సిబ్బందికి తెలియచేసి, సమస్య పరిష్కారానికి వారికి సహకరించాలని ప్రత్తిపాటి సూచించారు. రైతుల ఆవేదనను గ్రహించి రెవెన్యూ యంత్రాంగం భూ సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు వేగంగా దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత , టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, ఎమ్మార్వో కుటుంబ రావు, సొసైటీ చైర్మన్ శేషయ్య, నాయకులు కెల్లంపల్లి ఆచయ్య, నర్నే కోటయ్య స్వామి, ఉప సర్పంచి నార్నె సరవయ్య గ్రామ నాయకులు టీడీపీ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.





# జాబిదాకునివాళులర్పించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట అక్షర విజేత చిలకలూరిపేట పట్టణం సుభాని నగర్ వాస్తవ్యులు, సుబ్బయ్యతోట లోని శ్రీ బాలాజీ ఆర్ ఓ వాటర్ సిస్టమ్స్ సంస్థ యజమాని షేక్ కాలేషా కోడలు జాబిదా (సాహుల్ హమీద్ భార్య ) గుండె సంబంధ సమస్యతో బాధపడుతూ ఈరోజు ఉదయం కన్నుమూశారు.ఈ విషయం తెలుసుకొని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఇంత చిన్న వయసులో కోల్పోవడం చాలా బాధాకరమని తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేసి, ఈ బాధ నుండి కోలుకునేలా భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని అందించాలని కోరిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఈ కార్యక్రమంలో వారివెంట షేక్ అబ్దుల్లా , స్పెట్స్ కరిముల్లా తదితరులున్నారు.

# ఏజన్సీ ప్రాంత రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

### -ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

అక్షర విజేత జీలుగుమిల్లి

ఏలూరు జిల్లా ఏజన్సీ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే రోడ్ల మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యంత కీలకమని, అందుకే కూటమి ప్రభుత్వం ఏజన్సీ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు.



మంగళవారం బుట్టాయగూడెం మండల పరిధిలోని దొరమామిడి నుండి ఆలివేరు వరకు పీఆర్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు గ్రామస్థులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అలాగే అంతర్వేదిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రిబ్బన్ కట్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రోడ్ల వల్ల ఏజన్సీ గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని, ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు తీసుకొస్తామని, పోలవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు, గ్రీనరీ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు, తీగల గోపాలకృష్ణ, జి.ఎస్. నాయుడు, మనోహర్, పూనెం రాజా, ఏలేటి ఏడుకొండలు, దాసరి మాణిక్యాలరావు, గురజాల వెంకటేశ్వరరావు, తుష్టి చిన వెంకటేశ్వరరావు, కైగాల సూరిబాబు, మడివి నాగ దుర్గారావు, జోడే కృష్ణమూర్తి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాండ్ల కులస్తులుచే రామకుప్పంలో దొడ్డన్న శెట్టి జయంతి వేడుకలు.

రామకుప్పం అక్షరవిజేత.



కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నాగరంగంలో 100 సంవత్సరాల క్రితమే పేద విద్యార్థుల కోసం కోట్లాది రూపాయలు విలువచేసే ఆస్తులను వదులుకొని సమాజసేవలో ముందుండి మైసూరు సంస్థానాదీషులు నాల్వడి చామరాజ వడియార్ మహారాజుల వద్ద జనోపకారి అను ప్రశంసను పొంది లక్షల కోట్ల ఆస్తులను పేద గాండ్ల కులస్తుల కోసం దానంగా ఇచ్చిన గాండ్ల కుల బాంధవుడు జనోపకారి శ్రీ దొడ్డన్న శెట్టి 186వ జయంతి ఉత్సవాలను మంగళవారం రామకుప్పం మండల కేంద్రంలో గాండ్ల యువజన సంఘం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆటో సర్కిల్ వద్ద శ్రీ దొడ్డన్న శెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి బాణాసంచా కాల్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల వ్యాప్తంగా గల గాండ్ల కులస్తుల పేద విద్యార్థులు బెంగళూరులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలేజీ మరియు దొడ్డన్న చెట్టి హాస్టల్లో చదువుకొని నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడ్డారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలో గల గాండ్ల కులస్తుల వందలాదిమంది విద్యార్థులు బెంగళూరులోని దొడ్డన్న శెట్టి హాస్టల్లో ఉచితంగా భోజన వసతి పొంది అక్కడ ఉన్న మంచి విద్యాలయాల్లో చదువుకొని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో రామకుప్పం మండల గాండ్ల కులస్తులు, పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు

**-ప్రభుత్వ శాఖల సమన్వయంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి....**

**-భక్తులు ఇతరులకు ఆటంకం లేకుండా పోలీసు వారి సూచనలను పాటిస్తూ తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి... -జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**

అక్షరవిజేత, శ్రీశైలం

నంద్యాల జిల్లా శ్రీశైలం నందు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శనం నిమిత్తం వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వారికి ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ వారు పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది.అనంతరం శ్రీశైలం నందు భక్తులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా తీసుకునే చర్యలలో భాగంగా శ్రీశైలం నందు గల పార్కింగ్ ప్రదేశాలను అనగా రింగ్ రోడ్డు వద్ద గల పార్కింగ్ ప్రదేశాలను, ఆర్టీసీబస్టాండ్, సాక్షి గణపతి, హటకేశ్వరం ,సుండిపెంట గ్రామం నందు లింగాల గట్టు మొదలగుప్రదేశాలలో స్వయంగా పర్యటించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, మరియు లింగాలగట్టు స్నానఘాట్ లను కూడా పరిశీలించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది.భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం విచ్చేయు భక్తులు పోలీసు వారి సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం లేకుండా పార్కింగ్ చేసుకోవాలని,రోడ్డుకు ఇరువైపులా ఎట్టి పరిస్థితుల్లో పార్కింగ్ చేయరాదని విజ్ఞప్తి చేశారు.

